క్లుప్తంగా

ఎన్టీపీసీ మహిళా ఎగ్జిక్యూటివ్‌లకు అభినందన



విధి నిర్వహణలో ఉన్న మహిళా ఎగ్జిక్యూటివ్‌లతో ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ మొదటి యూనిట్‌లో వార్షిక మరమ్మతుల అనంతరం విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించడం(సింక్రోనైజ్)లో విశేష కృషి చేసిన మహిళా ఎగ్జిక్యూటివ్‌లను శనివారం సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు. వార్షిక మరమ్మతుల అనంతరం యూనిట్–1 లో శుక్రవారం విద్యుదుత్పత్తిని పునరుద్ధరించిన విషయం తెలిసిందే. మహిళా ఎగ్జిక్యూటివ్‌ల ద్వారా యూనిట్‌ను (సింక్రోనైజ్) పునఃప్రారంభించడం ఎన్టీపీసీలో ఇది మొదటిసారని సిన్హా పేర్కొన్నారు. మహిళా సాధికారితలో ఇది ఓ భాగమన్నారు. కార్యక్రమంలో ఓ అండ్ ఎం జీఎం డి.పి. పాత్ర, ఆపరేషన్ జీఎం టి.ఆర్.రాజగోపాల్, జీఎం మాథ్యూ ఇకోపూరు పాల్గొన్నారు.

సంపన్న దేశంగా తీర్చిదిద్దడమే మోదీ లక్ష్యం



వెన్నలపాలెంలో మహిళకు ఆయుష్మాన్‌భవ కార్డు అందజేస్తున్న రామునాయుడు

పరవాడ: దేశాన్ని సంపన్న దేశంగా తీర్చిదిద్దడమే ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రామునాయుడు అన్నారు. పరవాడ, వెన్నలపాలెం గ్రామాల్లో శనివారం నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలను సంపన్నులు చేయడం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ముద్ర యోజన, విశ్వకర్మ యోజన, ఆయుష్మాన్‌భవ, సుజలధార వంటి పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. వెన్నలపాలెం ఎన్టీఆర్ కాలనీకి కరెంటు, ఇతర సమస్యలు పరిష్కరించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావు, ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, ఏవో రాంబాబు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

మర్రిపాలెం: సింహాచలం రైల్వే స్టేషన్ పరిధిలో పట్టాలపై గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే పోలీసులు గుర్తించారు. వారు తెలిపిన వివరాలిలా.. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు, 5.2 అడుగుల ఎత్తు కలిగి చాయనఛాయ రంగులో ఉన్న వ్యక్తి నలుపు రంగు ఫ్యాంట్ ధరించాడు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ ఉదయ్‌భాస్కర్ కేసు దర్యాప్తు చేపట్టారు. గుర్తు తెలియని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసిన వారు 0891–2881910, 98481 68309 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

అవ్వాతాతల మోములో ఆనందం



వేపగుంట జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణలో సామాజిక పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



వైఎస్సార్ పింఛన్ కానుక అందిస్తున్న గొరపల్లి, గవరపాలెం సర్పంచ్‌లు గొరపల్లి శ్రీను, కొయిలాడ శ్రీను

- పండగ వాతావరణంలో రూ.3 వేల పింఛన్ల పంపిణీ
- సీఎం వైఎస్ జగన్‌కు లబ్ధిదారుల ధన్యవాదాలు



మొగలిపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న యడ్ల నాయుడు, ఐడీబాబు తదితరులు



93వ వార్డుగణేష్‌కాలనీలో పింఛన్లు అందజేస్తున్న వలంటీర్



పైడవాడ అగ్రహారంలో పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ వద్దాది అప్పలరాజు తదితరులు

పెందుర్తి: వైఎస్సార్ పింఛన్ కానుక పెంపుదలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌ను రూ.3 వేలకు పెంచడంతో లబ్ధిదారుల మోములో ఆనందం వెల్లివిరుస్తోంది. తమ ఇంట పెద్ద కొడుకులా ఆదుకుంటున్నాడని సంబరపడుతున్నారు.పెంచిన పింఛన్లను పండగ వాతావరణంలో పంపిణీ చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ జోన్–8 ప్రాంతంలోని పింఛన్ దారులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం డాక్టర్ వైఎస్సార్ పెన్షన్ కానుక అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలపై నిజమైన ప్రేమ కలిగిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు ఏం కావాలో.. వారికి ఎం చేయాలో నిరంతరం ఆలోచించే గొప్పనేత సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన్ను మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీరాం, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి ఆదిరెడ్డి మురళి, జేసీఎస్ జోన్–8 ఇన్‌చార్జి మనాలత జోబ్‌దాస్(చిన్ని), పార్టీ నేతలు బల్ల రాంబాబు, దాసరి అన్నపూర్ణ, తామర్ల నర్సింగ్, మెంటి మహేష్, దాసరి సత్తిబాబు, కార్తీక్, సంపత్ వర్మ, తిరుమల వినోద్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

➡ గొరపల్లి, గవరపాలెంలోని లబ్ధిదారులకు ఆయా పంచాయతీల సర్పంచ్‌లు గొరపల్లి శ్రీను, కొయిలాడ శ్రీనివాసరావు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాల అధికారులు, నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గణేష్‌కాలనీలో పింఛన్ల పంపిణీ

సింహాచలం: జీవీఎంసీ 93వవార్డు గణేష్‌కాలనీలో శనివారం పెరిగిన రూ. 3వేల పింఛన్ల పంపిణీ జరిగింది. వలంటీరు సీత వృద్ధులకు ఫింఛన్లు అందజేశారు. సచివాలయ కన్వీనర్లు ఈశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

436 మందికి పింఛన్ల అందజేత

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ఉత్సాహంగా సాగింది. మొగలిపురంలో ఐడీబాబు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు గ్రామంలోని 436 మంది లబ్ధిదారులకు పెంచిన పింఛన్ రూ.3 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోషి, వీఆర్వో జ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు గండి ముత్యాలనాయుడు,ఇండుగుబిల్లి గోపి,సిరపరపు అక్కునాయుడు,బండారు గణేష్,గండి బండయ్య పాల్గొన్నారు.

➡ మండలంలోని పైడివాడ అగ్రహారంలో సర్పంచ్ వద్దాది అప్పలరాజు పింఛన్లు పంపిణీ చేశారు.

అరకు–విశాఖ రోడ్డులో ప్రమాదం

- బైక్‌ను ఢీకొన్న టూరిస్టు వ్యాన్
- ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో తుప్పల్లో తుళ్లి పడిన బైక్

కొత్తవలస : అరకు–విశాఖ రోడ్డులో అప్పన్నపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి బైక్‌ను టూరిస్టు వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలానికి చెందిన కొర్రాయి రామకృష్ణ(34), జోగ చంద్రశేఖర్(34) అప్పన్నపాలెం గ్రామంలో జరిగిన బంధువుల పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. రోడ్డు దాటుతున్న సమయంలో అరకు నుంచి అతివేగంగా వస్తున్న టూరిస్టు వ్యాన్ బైక్‌ను బలంగా ఢీకొంది. బైక్‌పై ఉన్న ఇద్దరూ తుళ్లిపడిపోయారు. బైక్ సమీపంలో ఉన్న తుప్పల్లో పడిపోయింది. వ్యాన్ సమీపంలో మరో బైక్‌పై ఉన్న కొత్తవలస గ్రామానికి చెందిన పెదిరెడ్ల అప్పారావును కూడా ఢీకొట్టడంతో ఆయన కాలు విరిగిపోయింది. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రామకృష్ణ, చంద్రశేఖర్ గోపాలపట్నంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో, అప్పారావు కొత్తవలసలో చికిత్స పొందుతున్నారు. కొత్తవలస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన టూరిస్టు వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ కనకరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన నక్క వెంకటరమణ, నారాయణమ్మ దంపతులు లక్ష 116 విరాళం ఇచ్చారు. సింహగిరిపై దేవస్థానం తరపున సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజు దాతలకు బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో దేవస్థానం పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

‘ప్రత్యేక పిల్లలు’కు సేవ అభినందనీయం



చిన్నారులతో కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఆశ్రయం కల్పిస్తున్న సుజాతనగర్‌లోని శ్రేయ ఫౌండేషన్ 19వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముమ్మన దేముడు మాట్లాడుతూ దాదాపు రెండు దశాబ్దాలుగా వీరికి ఆశ్రయం ఇవ్వడం ఆదర్శనీయమన్నారు. ఫౌండేషన్‌కు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి డాక్టర్ ఉషాదేవి, ప్రతినిధులు సుజాత, శ్రేష్, భాగ్యలక్ష్మి, సంతోషి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల సత్తా



ఉద్యోగాలు పొందిన బాలికలకు నియామకపత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

మురళీనగర్: కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో ఇటీవల చెన్నైకు చెందిన గ్రీన్ ఎనర్జీ ఇనీషియేటివ్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో కళాశాల బాలికలు సత్తా చాటారు. టీపీవో ఎం.హరిబాబు పర్యవేక్షణలో ఈ కంపెనీ నిర్వహించిన రాత పరీక్ష, మౌఖిక పరీక్ష ప్రతిభ చూపిన 8 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సివిల్ విభాగం నుంచి వై.భవాని, జి.పూజితరెడ్డి, మెకానికల్ విభాగం నుంచి అల్లు కరుణ, ఎం.యోగేశ్వరి, వి.సాయివెన్నెల, లంకా నీరజ, ఎం.దేవ హర్షిణి, లాలం శృతి ఉద్యోగాలు పొందారు. వీరికి రూ.3.30 లక్షల వార్షిక ప్యాకేజీని కంపెనీ చెల్లిస్తుంది. శిక్షణలో భాగంగా మొదటి సంవత్సరం రూ.3.30లక్షలు, రెండో ఏడాది రూ.3.60 లక్షలు, శిక్షణ పూర్తయిన తర్వాత రూ.4 లక్షలకు పైగా ప్యాకేజీ ఇస్తారు. రాయితీపై క్యాంటీన్ సదుపాయం ఉంటుంది. కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగాలు పొందిన వారికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు నియామకపత్రాలు అందించారు. విభాగాల హెడ్‌లు కేడీవీ నరసింహారావు, కె.మధుకుమార్, జె.రాజేంద్రప్రసాద్, ఏటీపీవోలు ఎన్.జ్ఞాన ప్రసూన, బి.అర్చనరావు, ఆర్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సోషల్ సైన్సెస్ సెంటర్ ఏర్పాటు చేయాలి



సదస్సులో పాల్గొన్న మాజీ డీజీపీ ఆంజనేయరెడ్డి

సీతంపేట: పోస్టు గ్రాడ్యుయేషన్‌లో హిస్టరీలో విద్యార్థుల రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టాయని, ఇది విభాగాల మూసివేతకు దారితీసే ప్రమాదముందని మాజీ డీజీపీ సి.ఆంజనేయరెడ్డి అన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలో శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ రెండురోజుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రతి సబ్జెక్టు తనదైన అవసరానికి ఉపయోగపడుతుందని, యూనివర్సిటీలో ఏ విభాగాన్ని మూసివేయవద్దని ఏయూ ప్రొఫెసర్ సంపత్‌ను కోరారు. అలాగే నగరంలో సోషల్ సైన్సెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధుకుమార్ మాట్లాడుతూ కళాశాల గోల్డెన్ జూబ్లీ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ 46వ వార్షిక సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. బుల్లయ్య కళాశాల ఆరంభం నుంచి మార్జినల్‌లైన్ విద్యార్థులకు విద్యాసేవలందిస్తున్న కళాశాల అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రను ప్రొఫెసర్ వకులాభరణం రామకృష్ణ సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా సావనీర్‌ను ఏయూ వైస్ చాన్సలర్ కె.సమత ఆవిష్కరించారు. విశాఖ నగర చరిత్ర, సంస్కృతి, పేరు, మూలాలను ఆమె వివరించారు.కార్యక్రమంలో ఏపీహెచ్‌సీ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్ కేసీ రెడ్డి, ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్ పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

విశాఖ సిటీ : విశాఖలో బెల్టు షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో జరిగిన ఈ తనిఖీల్లో 294 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. గాజువాక హైస్కూల్ రోడ్డు ఉన్న బెల్ట్‌షాప్‌లో 39 క్వార్టర్ బాటిళ్లు, దువ్వాడ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో ఒక షాపులో 59, ఆనందపురం గొట్టిపల్లి కల్లాలు వద్ద ఒక షాపులో 8 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే భీమిలి పరిధిలో బోయలూరు అగ్రహారంలో ఒక షాప్‌లో 38, పీఎంపాలెం సాయిరామ్‌కాలనీలో ఒక బెల్టుషాపులో 11, పెందుర్తి పరిధిలో పినగాడిలో ఉన్న షాపుల్లో 139 క్వార్టర్ బాటిళ్లు సీజ్ చేసి సంబంధిత పోలీస్‌స్టేషన్లకు అప్పగించారు.

ఇగ్నో ప్రవేశాలు ప్రారంభం

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జనవరి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సు ల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. https:// ignouadmission. samarth.edu.in/ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. జనవరి 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలి.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, చిత్రంలో సుధాగజపతిరాజు, శ్రీనుబాబు తదితరులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు ముద్రించిన 2024 క్యాలెండర్‌ను శనివారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త, దివంగత పూసపాటి ఆనందగజపతిరాజు సతీమణి సుధాగజపతిరాజు, కుమార్తె ఊర్మిళ గజపతిరాజు, డిప్యూటీ ఈవో సుజాత, సూపరింటెండెంట్ సునీల్ పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పెందుర్తి ట్రాఫిక్ విభాగం ఎస్‌ఐ జి.రమేష్ తెలిపిన వివరాలు.. పెందుర్తి సమీపంలో దాదాపు 60 ఏళ్ల వృద్ధుడు అపస్మారక స్థితిలో ఉండడాన్ని శనివారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆ ప్రాంతానికి చేరుకున్న పోలీసులు అతడ్ని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మరణించాడు. మార్చురీలో శవాన్ని భద్ర పర్చారు. సమీప ప్రాంతానికి చెందిన వాడా?. లేక వేరే ప్రాంతం నుంచి వచ్చి అస్వస్థతకు గురయ్యాడోనని పోలీసులు అనుమానిస్తున్నారు. అతడి వివరాలు తెలిసిన వారు 94407 796064 నంబర్ లో సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 96వ వార్డు ప్రశాంతినగర్ నుంచి బాలాజీనగర్ వరకు తారు రోడ్డు పునరుద్ధరణ పనులను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ రూ.38.66 లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలకు మేలు చేయాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు గొర్లె రామునాయుడు, కిల్లి అప్పారావు, దాడి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కల్యాణం.. కమనీయం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని శేషతల్పంపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు చిన్నా, రంగనాథ్, శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా శ్రీనృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న ప్రధానార్చకుడు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి తదితరులు

సింహాచలం: స్వాతి నక్షత్రం పురస్కరించుకుని సింహగిరిపై శనివారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజు సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.దీనిలో భాగంగా ఉదయం 7గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో హోమం విశేషంగా నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణమండపానికి తీసుకువచ్చి హోమగుండం వద్ద అధిష్టింపజేశారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శేషతల్పంపై వేంచేయజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమం విశేషంగా నిర్వహించారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలతో స్వామివారి అష్టోత్తరనామావళిని పఠింపజేశారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆజలాలను భక్తులపై చల్లారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెంకటాద్రి.. ఆధ్యాత్మిక ఝరి



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

- ఘనంగా ధనుర్మాసోత్సవాలు
- నేడు సుదర్శనహోమం

పెందుర్తి: వెంకటాద్రి భక్తజన సంద్రంగా మారింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామిని దర్శించుకోవడానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి విశేష పూజలు జరిపారు. తిరుప్పావై 21వ పాశురాన్ని వివరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వెంకటాద్రిపై సుదర్శన హోమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి భారీ ఎత్తున భక్తులు హాజరుకానుండడంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రీ సర్వేలో రైతుల అభ్యంతరాలను స్వీకరిస్తాం

- ఏడీ సర్వే గోపాలరాజు

సబ్బవరం: సమగ్ర భూ సర్వేలో భాగంగా రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను స్వీకరించి వారి సమస్యలు పరిష్కరిస్తామని సర్వే ఏడీ గోపాలరాజు తెలిపారు.మండలంలోని సబ్బవరం–2 సచివాలయం పరిధిలోని రీ సర్వేకు సంబంధించిన జాబితాను శనివారం ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు వారి కమతాలకు సంబంధించిన వివరాలను తెలిపారు. ఏడీ మాట్లాడుతూ సబ్బవరంలో 1368 సర్వే రాళ్లు,ఎల్లుప్పిలో 1110 సర్వే రాళ్లు, బోదువలసలో 920 సర్వే రాళ్లు పాతేందుకు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే అసకపల్లిలో 988 రాళ్లు పాతడం జరిగిందన్నారు. సబ్బవరంలో తొలివిడతలో ప్రభుత్వ భూముల్లో సర్వే రాళ్లు పాతడం ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దెద్దం ప్రసాదరావు,ఎంపీటీసీ బైలపూడి దేముడు,తహసీల్దార్ సత్యనారాయణ,మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, డీటీలు వెంకట్,గణేష్,సర్వే ఇన్ స్పెక్టర్ ఈశ్వరరావు,మండల సర్వేయర్ కర్రి శ్రీనివాసరావు,స్థానిక నాయకులు గొంప దేముడు, కొటాన అప్పారావు,ఆర్‌ఐ వీరయ్య పాల్గొన్నారు.